ఆడవలసిన అబద్ధం

కొడవటిగంటి కుటుంబరావు

అతని పేరుతో మనకు ప్రసక్తిలేదు. అది చాలా సామాన్యమైన పేరు. ఆ పేరుగలవారు ఆంధ్ర దేశంలో అనేకమంది ఉంటారు. మాటవరసకు అతన్ని నేతిసుబ్బారావు అని పిలుద్దాం.

ప్రతివాడికీ జీవయాత్ర విశాలమైన తారురోడ్ల మీద సుఖకరమైన మోటార్లలో ప్రారంభంకావటం అసంభవమే. కాని దారి అక్కడక్కడా అప్పుడప్పుడూ చదునుగా కనిపించకపోతే సామాన్యవ్యక్తికి పిచ్చిఅయినా ఎత్తుకుంది, ఆత్మహత్య అయినా చేసుకుంటాడు.

సుబ్బారావు ఏవిధంగానూ అసామాన్యవ్యక్తి కాడు. సామాన్యమానవుడు చెయ్యలేనిపని అతనేదీ చెయ్యలేదు. అయినా అతని జీవయాత్ర ముళ్లకంచెల మధ్య ప్రారంభమై భయంకరమైన ఊబిలోకి తీసుకుపోయింది అతన్ని. రెండుసంవత్సరాలపాటు అతనికి పూర్తిగా మతిచెడిపోయింది. ఇంకా రెండునెల్లలో అతనికి మంచిరోజులు వస్తున్నవనగా అతను ఆత్మహత్య కూడా చేసుకోజూచాడు. అందులోకూడా విధి తనకు విరుద్ధంగానే నడవాలా అని అతను చింతించాడు. అతని ఆత్మహత్యాప్రయత్నం జయప్రదం కాలేదు.

ఇంతకూ ఆరోజులన్నీ గడిచిపోయినై. ఇరవై మూడేళ్లు వార్ధక్యం కాదు. అందరిచేతనూ గర్హించబడే భీమాకంపెనీ ఏజంటుపని ప్రారంభించి సుబ్బారావు నెలకు నూరు, నూటయాభై సంపాదనలో పడ్డాడు. అతని కిప్పుడేమీ కొరతలేదు. అతన్ని అందరూ ఎంతో దయతో చూస్తారు. లోపల ఏమనుకుంటారో ఈశ్వరుడికే తెలుసు. పైకి అతన్ని ఎవ్వరూ అసహ్యించుకున్నట్టు కనిపించరు.

ప్రపంచంలో ఇంతమంది గొప్పవాళ్లున్నారు — కళోపాసకులు, శాస్త్రజ్ఞులు, ఉపన్యాసకులు, రచయితలు — వాళ్ల జాబితాకు అంతులేదు. అనుదినమూ అతనికి కనిపించేవారిలో సహం మంది పేర్లు ఏదో కారణంవల్ల ఆంధ్రదేశానికి బాగా పరిచయములైనవే. వారితో తనకు పరిచయం కలగటమే తనభాగ్యం అనుకునేవాడు సుబ్బారావు. అతని పేరెంత సామాన్యమైనదో అతనుకూడా అంత సామాన్యుడే కద! అతనిచేత గొప్పవారికింద గణింపబడేవారి కందరికీ ఏహ్యంగా గోచరించే ప్రపంచం సుబ్బారావుకు చాలా ఆనందమయంగా కనిపించింది. ఇరవైమూడు సంవత్సరాలపాటు అన్నివిధాల ప్రాపంచికసుఖాలకూ దూరుడై ఉండిన సుబ్బారావు తాను చిట్టచివరకు ఈప్రపంచంలో సుఖపడటం భగవంతుడియొక్క దయవల్ల ననీ, ప్రపంచం తనకు చూపిన ఆదరంవల్లననీ నమ్మాడే కాని తన ప్రజ్ఞవల్లనని అనుకోలేదు. ఇంతకాలమూ తనప్రజ్ఞ ఏమి చెయ్యగలిగింది?

అతని కల్లా ఒక్కటే కోరిక — జరిగిన దంతా స్మరణకైనా రాకూడదని. గతాన్ని అతను పూర్తిగా విసర్జించాడు; అందులో తన కేమీ మిగిలిలేదు — కనీసం అత నట్లా భావించుకున్నాడు.

పూర్తిగా రెండు సంవత్సరాలపాటు సుబ్బారావు తన కష్టదశను మరిచి ఈనూతన జీవితాన్ని ఆరంభించాడు. పాతస్నేహితుణ్ణి ఒక్కణ్ణి అయినా పోగొట్టుకోకుండా రోజూ కొత్తస్నేహితులను సంపాదించుకుంటున్నందుకు అతను చాలాగర్వపడేవాడు. ఆరోజుకారోజు అతని ఆర్జనకూడా జాస్తి అవుతున్నది. కొద్దిరోజుల క్రితమే అతను వెనక తీసుకొన్న రెండువేల పాలసీకాక మరొక మూడువేలకు మరొకపాలసీ తన కంపెనీలోనే తీసుకున్నాడు. అదికాక అతనిపేర బాంకులో ఒక వెయ్యిరూపాయల డిపాజిటుకూడా ఉన్నది. అతను ఎక్కువడబ్బు ఖర్చుపెట్టే మనిషి కాడు. మంచి

దుస్తులూ, మంచి ఆహారమూ, మంచి ఇల్లూ మించి అతను కోరిందేదీ లేదు—ఒక్కటితప్ప. మంచిభార్య! అతని సామాన్యతను సహించ గల మంచిభార్య- అదీ అతను గాఢంగా కోరింది. అది అతనికి తీరని కోర్కె అయిపోయింది. అతనికి అందమనేదికూడా తెలియదు పాపం. అతని స్నేహితులలో గొప్ప చిత్ర కారు డొకడున్నాడు. అతను మధ్యమధ్య ఏదృశ్యమో ఏ స్త్రీనో చూసి, "ఆహా! ఏమిసౌందర్యం!" అనే వాడు. ఆ సౌందర్యం ఎక్కడ ఉందో, దాని స్వరూప మేమిటో గ్రహింతామని సుబ్బారావు విశ్వప్రయత్నం చేసికూడా విఫలుడైనాడు. సుబ్బారావుకు సౌందర్య పిపాస కలిగింతామనే. సదుద్దేశంతో ఆ చిత్రకారుడు "నీకు అందంగా కనిపించే మొహాలు నాకు చూపిస్తూ ఉండు!" అన్నాడు సుబ్బారావుతో. సుబ్బారావు చూపించాడు. చిత్రకారుడు నిస్పృహుడైనాడు. కాని ఆ చిత్రకారుకు ఒకపని చెయ్యవలిసింది. సుబ్బారావు కళ్లకు అందంగా కనిపించిన మొహాల తాలూకు మను ష్యుల ప్రకృతి ఎటువంటిదో విచారించి ఉండవలిసింది. వారంతా సాధువులు, మంచివారికింద పరిగణింపబడ దగినవారు!

సుబ్బారావు తనకు "ఆకన్ను" లేదనే నిశ్చ యానికి వచ్చాడు.

మరొక గాయకుడైన స్నేహితుడు సుబ్బారావుకు "ఆ చెవి" కూడా లేదని నిరూపించాడు. సుబ్బారావు దిగులుపడలేదు. తనను భగవంతు డట్లా సృష్టించాడు. అంతే!

"నాకు అందమైన భార్య అవసరంలేదు. నే నామెసౌందర్యం అనుభవించలేను. అప్పుడామెకు చాలా కష్టంగా ఉంటుంది. ఎన్నడూ ఎవరితోనూ పోట్లాడనిది, ఎప్పుడూ సంతోషంగా ఉండగలది, సుల భంగా తృప్తిపడగలది, నన్ను చూసి అసహ్యపడనిది అయిన భార్య నాకు చాలు!" అనుకున్నాడు సుబ్బా రావు. మరుక్షణం అతనికి తనకోరిక గొంతెమ్మకోరిక మాదిరిగా కనిపించింది. ఎందుకంటే, రాజాధిరాజు కైనా అంతకన్నా ఎక్కువకోరిక ఉండనవసరం లేనట్టు కనపడ్డది. కాని అంతకన్న తక్కువభార్యతో తనకు సుఖం ఉండదని అతను గ్రహించాడు.

"ఈ కోరిక తీరని కోరికే. పోనీ, యావజ్జీవమూ ఇట్లాగే బ్రహ్మచర్యంలో ఉంటాను. ఒక నేతి సుబ్బా రావుకు ఒక్క తీరనికోరిక ఉండటం అసహజమా ఏమిటి?" అని అతను నిట్టూర్పు విడిచాడు. భార్య కోసరం వాంఛించటమే తను మానుకుందామనికూడా అతను ప్రయత్నంచేశాడు. కాని అతని ప్రయత్నం లేకుండానే అది సముద్రతరంగంమాదిరిగా అతని మీద విరుచుకుపడేది.

అన్నివిధాలా తను అసమర్థుడు కావచ్చును. కాని తనలో ప్రేమించేశక్తి ఉన్నది. తనహృదయం ప్రేమ తో నిండి పొర్లికూడా పోతున్నది. తనకు ఆశక్తినిచ్చిన ప్రకృతి దాన్ని సద్వినియోగంచేసే అధికారంకూడా ఇచ్చింది. తను తనకు తగినభార్యకోసం—తనప్రేమకు నిజంగా పాత్రురాలయే స్త్రీకోసం—ఎందుకు వెతక కూడదూ?

కాని అతను ఆ అన్వేషణ ఎన్నడూ ప్రారం భించలేదు. అతని ఆంతరంగికస్నేహితులు ఒకరిద్దరు అతన్ని ప్రోత్సాహించారు కూడాను. కాని అతను భార్యకోసరం ప్రయత్నాలుప్రారంభించలేదు. "ఇప్పుడు కాదు. నే నింకా గట్టితీర్మానానికి రాలేకుండా ఉన్నాను." అని అతను తప్పించుకునేవాడు. అతను ఖయాలీమనిషి కాడని వారెరుగుదురు. అందుకని వారు అతని సందేహానికి కారణం ఉంటుందని నమ్మి ఊరు కున్నారు.

రోజులు గడిచినై.

ఒకనా డుదయం అయిదుగంటలకు అతను పక్కలో లేచి కూర్చున్నాడు. కిటికీలోనుంచి చక్కని చల్లగాలి వీస్తున్నది. కిటికీబయట ఉన్న ఒక చిన్న పూలమొక్క అతన్ని చూసి నవ్వింది.

"వసంతకాలంవచ్చింది!" అన్నది పూలమొక్క. "నాకోసరం కాదు!" అనుకుని సుబ్బారావు తల అడ్డంగా తిప్పాడు దీనంగా చిరునవ్వు నవ్వుతూ.

అతను లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసేటప్పటికి అతనికి పనిచేస్తున్న కుర్రవాడు ఇల్లు చిమ్మి కాఫీహోటలుకు వెళ్లి అతనికి కావలసిన ఫలహారమూ, వస్తూవస్తూ పోస్టాఫీసునుంచి ఉత్తరాలూ తెచ్చి బల్లమీద పెట్టాడు.

ఆనాడు అతనికి రెండే ఉత్తరాలు వచ్చినై. ఒకటి భీమాకంపెనీనించి. ఆ ఉత్తరం చూసి సుబ్బారావు అమితఆశ్చర్యపడ్డాడు. కంపెనీవారు అతన్ని చాలారహస్యమైనటువంటి ఒకపనిమీద నియోగించారు. అంతకుపూర్వం ఎన్నడూ అటువంటిది అతనికి జరగలేదు; మనిషి చాలా కంగారుపడిపోయినాడు సంతోషంతో.

ఆకంగారులోనే రెండోవుత్తరం తీసి చదవటం మొదలుపెట్టాడు.

“‘చిరంజీవి’...కంపెనీవారు ఇంతమంది ఏజంట్లలోనించి తన్నే ఎందుకు ఎన్నుకున్నారో...‘నీకు చాలాఆశ్చర్యం కలగవచ్చును’...అయితే తనతో కంపెనీవారు చాలా తృప్తిపడ్డారన్నమాట. లేకపోతే తనయందు వారి కంత నమ్మకం... ‘మీ మామగారిని క్షమించలేకపోయినా ఆయన ఇప్పుడు వచ్చి స్వర్గాన’ఇది మంచి అవకాశం. ఈ దెబ్బతో తన్ను కంపెనీవారు ఏజిల్లాకో ఏజంటుగా పారేసినా ఆశ్చర్యం లేదు”

ఉత్తరమంతా పూర్తిచేసిన తరువాత తనకు అందులోని సారాంశం ఈషణ్మాత్రమైనా బోధపడలేదని సుబ్బారావు కనుక్కున్నాడు. అతను కాస్త మనస్సు నిలకడ చేసుకుని ఉత్తరం ఒక్కసారి పైనించి కిందికి చూశాడు. ఆడస్తూరి ఎవరిదీ? కింద దస్కతు చూశాడు. “వెంకటరమణయ్య” అని ఉంది. ఎవరీ వెంకటరమణయ్య ?

జాగర్తగా ఉత్తరం మొదట మొదలుపెట్టి తిరిగీ చదవటం మొదలుపెట్టాడు.

“చిరంజీవి నేతి సుబ్బారావును (ఫలాని) వెంకటరమణయ్య పుత్రపౌత్రాభివృద్ధిగా ఆశీర్వదించి వ్రాయునది. ఈ ఉత్తరం చూసి నీకు చాలా ఆశ్చర్యం కలగవచ్చును. నీ మామగారు పదిసంవత్సరాలక్రితం చనిపోయినప్పటినించీ నీ భార్య అయిన సీతారామమ్మను నేను పెంచుతూ వచ్చినాను గనుక నేను నీకు మామగారి తుల్యుడను, తండ్రివంటివాణ్ణి. నాకు నీ మేలున్నూ, నీ భార్య మేలున్నూ తప్ప మరేమీ ఎక్కువకాదు. నీకు నీ మామగారు చాలా అపకారము చేసినమాట వాస్తవమే. కాని నీ భార్య చాలా యోగ్యురాలు. పెంచిన మమకారం కావచ్చును. నాకు నాకుమార్తెకంటె ఉత్తమురాలు కనిపించదు. నీవు నీమామగారిని క్షమించలేకపోయినప్పటికిన్నీ పిల్లదాని అమాయకత్వము చూసి దాన్ని నీ భార్యగా తిరిగీ స్వీకరించమని నేను



“జాగర్తగా ఉత్తరం తిరిగీ చదవటం మొదలుపెట్టాడు.”

నిన్ను పెద్దవాడనో చిన్నవాడనో ప్రార్థించుతున్నాను. మా సీత నాయందు ఎంత ప్రేమగలదయినప్పటికీ దాని మనస్సు భర్తమీదికి పోతున్నదని నాకు తెలియవచ్చినది. అది సహజమే. నేను మిమ్మల్నిద్దర్నీ కలపవలసిన బాధ్యతను గుర్తించినవాడనై, నీవు నా సలహాను అతిక్రమించవని నమ్ముతూ, పిల్లను తీసుకుని బయలుదేరుతున్నాను. రేపు ఉదయం తొమ్మిదిగంటలకు మాకొరకు నిరీక్షించుచుండేది.

వెంకటరమణయ్య."

ఆ ఉత్తరంచూసి అతను అమిత ఆశ్చర్యపడ్డాడు. మరిరెండుసార్లు చదివి చూసినా ఆమాటలన్నీ అక్కడే ఉన్నై. ఉత్తరం తనది అవునో కాదో అని కవరుమీద చిరునామా చూశాడు. ఉత్తరం తనదే. ఆ ఊళ్ళోనే మరొక నేతిసుబ్బారావున్నమాట నిజమేకాని ఆయన ఇన్సూరెన్సు ఏజంటూ కాదూ, ఆయన డెబ్భయి అయిదేళ్ళవాడుకూడానూ. ఈ ఉత్తరం ఆయనది కావటం అసంభవం. ఉత్తరం తనదే. అయితే?--

ఎనిమిదయింది. ఇంకోగంటలోవస్తారు ఆ వెంకటరమణయ్యా, సీతారామమ్మా! సీతారామమ్మ-సామాన్యమైన పేరే.

సరిగా తొమ్మిదీ అయిదింటికి బండీ వచ్చి సుబ్బారావింటిముం దాగింది. ఆ బండిలోనించి ఒక నలభై సంవత్సరాలవయస్సుగల ఒక పెద్దమనిషీ, అంతే వయస్సుగల ఒక వితంతువూ, ఒక ఇరవై సంవత్సరాల వయస్సుగల ఒక పిల్లా దిగారు; లోపలికి వచ్చారు.

సుబ్బారావు మర్యాదగా లేచి నుంచున్నాడు. అతనికి మాట్లాడటానికి ఏమీ కనిపించలేదు. అతనా ప్రయత్నంకూడా చెయ్యలేదు.

"నీభార్యను నీకు వప్పగించాం నాయనా. మాపని అయిపోయింది. ఇక నీయిష్టం, ఆవిడయిష్టం!" అన్నది వితంతువు.

వెంకటరమణయ్య—మరి ఆ పెద్దమనిషి వెంకటరమణయ్యగారే అయిఉండాలి—సుబ్బారావును సమీపించి బలవంతాన దుఃఖం ఆపుకుంటున్నవాడల్లే "ఆపిల్లమీద నాకున్న ప్రేమ నీకిప్పుడుండదు. పైగా నీమామగారు చేసిన పాడుపని నిన్ను కొంత కలవరపెట్టికూడా ఉండాలి. అందుచేత నీభార్యమీద నీకు చప్పున ప్రేమ పుట్టకపోవచ్చును. కాని ఆపిల్లను నీచాతనయినంతవరకు దయతో చూస్తానని నాకు వాగ్దానం చెయ్యి. నీకోసం చాలరోజులనించీ తపిస్తున్నది, అది నేను అనవలిసినమాట కాకపోయినప్పటికీ. నీభార్యను ఏలు, మాను. నేను నిన్ను నిర్బంధించలేను. కాని ఏకారణంచేతగాని దాని మనసు నొప్పించవద్దు. అది నాకోరిక." అని ఆ పెద్దమనిషి చెయ్యి చాచాడు.

సుబ్బారావు మారుమాట్లాడకుండా తనచెయ్యి అందించాడు.

వెంకటరమణయ్యగారి దైన్యం తాత్కాలికంగా ఒక చిరునవ్వుతో కప్పబడినట్లయింది.

"నువు మంచివాడల్లే కనిపిస్తున్నావు నాయనా! జరిగిందంతా మరిచిపోగలిగితే నువూ నీభార్యా చాలా సుఖపడతారని నాకు ధైర్యం ఉంది. సీత వెర్రిపని తలపెట్టిం దనుకున్నాను. అది పొరపాటే!"

సుబ్బారావు అప్పటికీ ఏమీ మాట్లాడలేదు. అతని మొహం చాలా శాంతంగా ఉంది కాని అతని మనస్సు అదివరకెన్నడూ ఆలోచించనంత వేగంతో ఆలోచిస్తున్నది. ఇక ఆ వెంకటరమణయ్య గారూ, ఆ వితంతువూ వెళ్లిపోతారు. ఆపిల్ల—ఎంత అందమైన మొహం!—ఆపిల్లా తనూ అయిపోతారు. అప్పుడు తను ఆమెతో మాట్లాడక తప్పదు. ఏంమాట్లాడాలి? ఎట్లా మాట్లాడాలి?

"ఇక మేం వెళ్లివస్తాం అబ్బాయి." అన్నాడు వెంకటరమణయ్య. ఆయన పెంపుడుకూతురు వంక తిరిగి, "నీకోరిక నెరవేర్చాను తల్లీ. నువూ నీభర్తా తరచు వచ్చిపోతూంటే నేను సంతోషిస్తాను. నిన్ను భగవంతుడు సుఖపెడతాడు" అన్నాడు.

ఆపిల్ల చెంగు అడ్డంపెట్టుకుని ఏడవటం మొదలుపెట్టింది. వెంకటరమణయ్యమొహం చూస్తే సుబ్బారావుకు జాలివేసింది.

చిట్టచివరకు వెంకటరమణయ్య, వితంతువూ వెళ్లి పోయినారు. సుబ్బారావుగుండె గుబుక్కు మన్నది.

సీతారామమ్మ దుఃఖం దిగమింగి కళ్లు తుడుచుకుంటూ ఒక్క సారి అతనివంక చూసింది. అతను ఆమె వంకనే చూస్తూ నిలబడ్డాడు.

ఆమె కళ్లునలపటం పూర్తిచేసి పరధ్యానంగా వాకిలివంక చూస్తూ తన ట్రంకుపెట్టెమీద ఆసీనురాలయింది. అతనుకూడా కుర్చీలో కూర్చున్నాడు. అతని కళ్లు ఆమెమొహంమీదే ఉన్నై.

"ఎంత అందమైన మొహం!" అనుకున్నాడు సుబ్బారావు. "ఎంత అందమైన కళ్లు!" ఏంలాభం— తను అందం అనుకునేది నిజంగా అందంకానప్పుడు? ఎవడికి కావాలి అందం—అసలుఅందం?" అనుకున్నాడతను మళ్లీ—కొంచెం కోపంగా. ఇదే అందం! ఇదే చక్కదనం—ఎందమంది ఇంకోటి చెప్పినాసరే!

అతని ఆలోచన యావత్తూ చిందరవందర అయేటట్టు సీత పెద్దనిట్టూర్పు విడిచింది. ఆమె వెంకటరమణయ్యనుగురించి విచారిస్తున్నదని కనిపెట్టి అతను "చాలా మంచివాడు పాపం!" అన్నాడు.

ఆమెమొహానికి ఒక్కవెలుగు వచ్చింది. ఆమె చప్పున తన విప్పారిన మొహం అతనివైపు తిప్పి "మా నాన్న కాదూ?" అన్నది.

సుబ్బారావు అవునని తల ఊపాడు. ఆతరవాత సీత తన తండ్రినిగురించి ఆలోచించటం కొంత తగ్గించి సుబ్బారావును గమనించటం మొదలుపెట్టింది.

"మీరుకూడా మంచివారే పాపం. నా మొహం చూడటానికైనా ఒప్పుకుంటారనుకోలేదు మానాన్న—మాఅసలునాన్న—చేసిన వెధవపనికి."

ఆతరవాత కాస్సేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు.

"అయితే నీ పేరు—సీతారామమ్మా?" అన్నాడతను.

"నా పేరు మరిచిపోయినారా?" అన్నదామె నవ్వుతూ. "నేను మీపేరు మరిచిపోలేదు...నన్నెవ్వరూ అంత పొడుగున పిలవరు. సీత అని పిలుస్తారు...నేను మిమ్మల్ని చివరిసారి చూసినప్పుడు నాకు ఏడు, కాదు ఆరేళ్లు. మీ రప్పు డెట్లా ఉండేవారో కూడా నాకింకా కళ్లకు కట్టినట్టుంటుంది."

"నేను మారానా?"

"మారలేదా?"

"నీ కిప్పుడు నే నెవరో పరాయివాడల్లే కనిపించటం లేదూ?"

"మీ రింకా అట్లాగే ఉంటారని అనుకున్నానా ఏమిటి? మారిఉంటారని నే నెట్లాగో అనుకున్నాను. మీ రిన్ని సంవత్సరాలనించీ నన్ను ఒక్కసారిఅయినా తలవలేదా?"

"నువ్వు నన్ను అట్లా అడిగి లాభంలేదు. నాకు ఈ రెండు మూడు సంవత్సరాలనించీ జరుగుతున్న విషయాలే జ్ఞాపకం ఉన్నై కాని అంతకు పూర్వం ఏం జరిగిందో ఏమీ జ్ఞాపకంలేదు."

"నిజంగానా?" అన్నది సీత ఆశ్చర్యంతో. "అయితే మీకు మానాన్న నాలుగేళ్ల వయస్సుగల వెధవపిల్లను పెళ్లిచెయ్యటంకూడా జ్ఞాపకంలేదా?"

"అట్లా అడిగి లాభం లేదన్నాను కాదూ? నేను పరాయివాణ్ణనుకొని జరిగిందంతా చెప్పు."

"చెప్పేటందు కేముంది? నన్ను కని మా అమ్మ చచ్చిపోయింది. మానాన్న వ్యాజ్యాలకోసరం ఆస్తి యావత్తూ తగలపెట్టి చివరకు నామూడోయేట నన్నొక ముసలివాడి కిచ్చి పెళ్లిచేసి ఆయనపంచను పడిఉన్నాడు. ఆముసలివాడు ఒక్కసంవత్సరంలోగాచచ్చిపోయినాడు. మానాన్న కాకాస్త అండా పోయింది. దూరదేశంవెళ్లి నన్ను మరొకరికిచ్చి పెళ్లిచేసి మళ్లీ ఎవరి అండనన్నా చేరుదామని ఆయనకు దుర్బుద్ధి పుట్టింది. పూరిలో మీనాన్నగారు తగిలారు. అప్పటికి మీకు ఏ డెనిమిదే ళ్లనుకుంటాను. మానాన్న మీనాన్నగారిని

యెట్లాగో ఒప్పించాడు మనిద్దరికీ పెళ్లి జరపడం విషయమై. మీ నాన్నగారికి మా నాన్న చెప్పిన జోశ్యంలో గురి కలిగి తనకు మారకం సమీపించిందని నమ్మి అట్లా చేశారు. ఆతరవాత ఒకటి రెండు సంవత్సరాలు గడిచినై. ఈలోపుగా మీనాన్నగారికి విజయనగరం ఆ స్థానంలో పనికుదిరింది. అక్కడే నా మొదటి పెళ్లి సంగతి బయటపడ్డది. అప్పుడు మీరూ,మీనాన్నగారూ మాయింటికి ప్రయాణమై వచ్చారు. మానాన్నను అనవలసినమాటలన్నీ అని తెగతెంపులు చెప్పి వెళ్లిపోయినారు. నే నదే మిమ్మల్ని కిందటిసారి చూడటం.

"ఆతరవాత మానాన్న కొద్దికాలానికే చనిపోయినాడు- వీధిలో. నన్నప్పుడు మాయీ నాన్న దగ్గిరికి తీసి పెంచటం మొదలుపెట్టాడు. ఆయనకు పాపం పిల్లలు లేరు. నన్ను తన కూతురికన్న ప్రాణంగా పెంచాడు, పెద్దదాన్ని చేశాడు. చదువు చెప్పించాడు. ఉన్నంతలో నా కేలోపం లేకుండా చూశాడు. ఆయన నా కెంత తండ్రిమాదిరిగా అయిపోయినాడంటే ఆయనకు నే నిప్పుడు కృతజ్ఞురాలినిగా ఉందామని ప్రయత్నంకూడా చెయ్యలేను. మీ కర్థమౌతుందనుకుంటాను."

సుబ్బారావు తల ఊపాడు.

"నాకు మళ్లీ పెళ్లిచేస్తా నన్నాడు మానాన్న- ఈనాన్న. నేను ఒప్పుకోలేదు. నాసాటివాళ్లంతా వారివారి భర్తలతో చక్కగా కాపరంచేస్తూ పతివ్రతాధర్మం నెరవేరుస్తున్నారు. నేనుమాత్రం ఎందుకు చెయ్యరాదు ? ఎప్పుడో మానాన్న నా కొక అవాచ్యమైన పెళ్లి చేశాడు కనుక నేను ఆధర్మానికి దూరం ఎందుకైపోవాలి ? వయస్సు వచ్చినతరవాత నేను మరొకభర్తను ఏరుకుని ఆయనతో కాపరంచేస్తే అందులో గొప్ప ఏముందీ ? ఆపని ఎవతె అయినా చెయ్యగలదు. పైగా ఇప్పటికాలపు పెళ్లి చేసుకుని పతివ్రతాధర్మం అంటే అంతా నవ్వుతారు. మొగుడికన్న మొగుడి స్నేహితులను ఎక్కువగా చూడటం ఇప్పటి ఫాషనల్లే ఉంది. నా కది రుచించదు.

'నీభర్త నిన్ను ఏలకపోతేనో?" అని మానాన్న నన్ను భయపెట్టేవాడు. పతివ్రతాధర్మానికి అవేవీ అడ్డంరావు. నేను నాభర్త వాకిలి కుక్కగా ఉండిఅయినా నాధర్మం నేను నెరవేర్చగలనని సమాధానం చెప్పాను.

"నేను తెలియనితనంచేత మాట్లాడతున్నానని మా నాన్న చాలాకాలం సందేహించాడు. ఆ తరవాత నా మొండిపట్టు నేను వదలనని గ్రహించి మీకోసం వెతికించటం మొదలుపెట్టాడు. నేను చెప్పగల విషయాలు బహుకొద్ది. నాకు మీ నాన్నగారి పేరుకూడా జ్ఞాపకం లేకపోయింది. మానాన్న పూరిలోనూ విజయనగరంలోనూ కొంతకాలం విచారించిన తరవాత మీ ఆచోకీ దొరికింది. ఆ తరవాత మీరు ఎక్కడెక్కడ ఎప్పుడెప్పుడున్నారో క్రమంగా అంతా ఆరాతీశాడు మానాన్న. మీసంగతి తెలిసినతరువాత నేను మిమ్మల్ని చూడాలని ముళ్లమీద ఉండసాగాను. అందుచేత నే మానాన్న మీకు అంత అవ్యవధిగా ఉత్తరంరాసి బయలుదేరాం. మానాన్న, పాపం, నామనసు బాగా కనిపెట్టగలడు."

సుబ్బారావు కొంతసేపు మౌనంగా ఉండి, "నీ పతివ్రతాధర్మం చాలా చిత్రంగా ఉంది. నాకు ఆపతివ్రతాధర్మంలో ఎక్కువనమ్మకం లేదు."అన్నాడు.

"మానాన్నకూ లేదు. నా కున్నది!"

ఆమాటకు అప్పీలే లేదు.

"మీరు నిజంగా చెప్పండి. ఈ విషయా లేవీ మీకు జ్ఞాపకంలేవా ?"

"నువు జ్ఞాపకంచేస్తుంటే నాకు ఒక్కొక్కటే లీలగా జ్ఞాపకంవస్తున్నట్టున్నది."

"మీ రెట్లా మరిచిపోయినారో నేను ఊహించలేకుండా వున్నాను."

"అయినా ఒకటి జరిగిందిలే. మూడునాలుగేళ్ల కిందట నా కొక పెద్దజబ్బు చేసి ఆజబ్బులో మతిపోయింది. వెనకటివి బాగా జ్ఞాపకంరావు."

పదిగంటలకు పనిచేసే కుర్రవాడు వచ్చి వారి సంభాషణకు అంతరాయం కలిగించాడు.

"హోటలునించి భోజనం ఇద్దరికి తీసుకరారా!" అన్నాడు సుబ్బారావు వాడితో.

వాడు చాలాసేపు సీతవంక చూస్తూ నిలబడి మాట వినిపించుకోక చివరకు చివాట్లు తిని టిఫినుకారియరు తీసుకుని వెళ్లాడు.

"సాయంకాలంనించీ నేనే వంటచేస్తాను. నాకు ఇంటిపనులు చెయ్యటం చాలాసరదా" అన్నది సీత.

ఇంట్లో ఆడది తిరుగుతుంటే అదొక శోభగా ఉంది. తన కోరిక భగవంతుడీవిధంగా తీర్చదలుచుకున్నాడా? అతని కామాట అనుకుని ఏంతృప్తి? ఇప్పుడీసీతను ఏంచెయ్యాలి? మారు మాట్లాడకుండా స్వీకరించాలా? అందువల్ల తనకు చాలా సుఖం చేకూరేటట్టే కనిపిస్తున్నది. దానికి తనెట్లా అర్హుడవుతాడు? ఆమె తనమీద చూపిస్తున్న ఆపేక్ష తను ఆమెభర్త అనే నమ్మకంతోనే. నేను నీభర్తను కాను అని చెప్పితే ఈ సీతే తనవంక ఎట్లా చూస్తుంది?

ఇటువంటి క్లిష్టపరిస్థితులు తనకే వస్తవా, లేక అందరికీ ఇంతేనా?

ఎంత విచారించినా ఓర్పుతో రాగలదానికి ఎదురుచూడటం తప్ప గత్యంతరం కనిపించలేదు.

మనిషినికనిపెట్టి ఉండటంలో సీత ఎంత నేర్పరి! తన అవసరాలన్నీ చెప్పకుండానే అట్లా గ్రహించి తనకు పరిచర్యచేసే మనిషి తన కెన్నడూ ఉండిఉండలేదు. అటువంటి భార్య ఉంటే కొంప భూలోకస్వర్గం అనిపించదా?

తనను చూసి సంతోషంగా ఉండకుండా ఉండలేదు. తన చూపు ఆమెచూపుతో కలిసినప్పుడల్లా తప్పక నవ్వుతుంది. తనకు కించిత్తు అసంతృప్తిగాని, కష్టంగాని కలిగినట్టు కనిపిస్తే చాలాఆదుర్దాపడుతుంది.

ఇదంతా ప్రేమా?

పతివ్రతాత్వమా, కొంపతీసి!

అందరు భార్యలూ—పాతివ్రత్యంలో నమ్మకం ఉన్న భార్యలు—భర్తలను ఇట్లాగే చూస్తున్నారా? చూస్తే ఆభర్తలంతా తనమాదిరిగా సంతృప్తి చెందుతున్నారా భార్యలతో? అనుమానాస్పదం.

ఇది పతివ్రతాత్వం కాదు, ప్రేమే!

అయితే ఏమీ ఎరగని తనను సీత ఎప్పుడు ఏకారణంచేత ప్రేమించటం మొదలు పెట్టినట్టూ!

సీత అతనికి అర్థంకాలేదు.

ఆమెమీద మాత్రం అతనికి ఆక్షణాని కాక్షణం ప్రేమ పుట్టుకురావటం మొదలుపెట్టింది. ఒకటిరెండు రోజుల్లోనే అది పెద్దప్రవాహమై ఉండును—అడుగడుగునా అతన్ని ఇటువంటి సంశయాలు బాధించక పోతే.

ఏమిటి తన ప్రారబ్ధం? తన కోరిక ఎంతనైపుణ్యంతో తీర్చాలో అంతనైపుణ్యంతో తీర్చాడు భగవంతుడు. అతనికి భార్యామీద మనస్సుపోయినా ఇప్పుడతను ఏచిన్నపిల్లనో చేసుకోవటం అసంభవం. పెద్దపిల్లను చేసుకుంటే ఆపిల్ల అన్నివిధాలా తను కోరిన రకంకాదని అనుమానం. (పెద్ద అయినతరువాత పెళ్లిళ్లుచేసుకునేవాళ్లూ, పునర్వివాహం చేసుకునే వితంతువులూ ఎట్లా అయినా కొంత గడుసుగా ఉండరూ?) తనకోరిక ఎంత గొంతెమ్మకోరికో అది తీరేవరకూ తెలిసిరాలేదు. ఇప్పుడు?

ఒకసారి పనిపెట్టుకుని ఈవిషయం సీతతో తర్కించాడు.

"సీతా, నీకు నామీద ఎంత అభిమానం?"

"మీకు నిజంగా నమ్మకం ఉందా?" అన్నది సీత నవ్వుతూ.

"నాకు కళ్లూ చెవులూ, లేవా? అయితే నాకొకటే ఆశ్చర్యం."

"ఏమిటది?"

"ఎందుకు నీకా అభిమానం నన్ను చూస్తే?"

"చేసుకున్న భర్తగారు కాదూ?" అని సిగ్గుపడ్డదానల్లే సీత తలవంచుకుంది.

అతని మనస్సు చివుక్కుమన్నది.

ఆతరవాత ఎన్నిసార్లడిగినా సీత అక్కడిదాకా వచ్చి ఆగిపోయ్యేది.

మూడురోజులు గడిచినై. సీతను ఏంచెయ్యాలో అతనికి తెలియనేలేదు. అతను ఆమెకు గజందగ్గిరిగాకూడా వెళ్లకుండా ఈమూడురోజులూ గడిపాడు. ఆమె అందుకు చింతించినట్టు కనపడలేదు. కాని తను ఏక్షణం చేతులుచాస్తే ఆక్షణం ఆమె తనదగ్గిరికి పరిగెత్తుకుని వస్తుందని అతనికి నమ్మకమే. ఆమెకళ్లలో ఒక్కొక్కసారి అంత అనురాగం కనిపించేది.

అంతా తన భర్తమీద!

కంపెనీవారి దగ్గిరనించి ఉత్తరంవచ్చి మూడు రోజులయింది. ఆవిషయం అతను తగిన చర్య తీసుకోనేలేదు. నాలుగోనాడు ఉదయం ఆపనిమీదే బయలుదేరాడు. అతను భోజనానికి వచ్చేసరికి ఒంటిగంట కావచ్చింది.

అతనికోసరం నిరీక్షిస్తున్న మనిషిమాదిరిగా సీత నవ్వుతూ ఎదురువచ్చి అతను విప్పిన కోటూ, చొక్కా తీసుకుంటూ "ఇంత ఆలస్య మయిందేమండి? పాపం, పొద్దున కాఫీహోటల్లో తిన్నతిండేనా?" అన్నది.

అతను వినుపించుకోలేదు. అతని భోగట్టా ఫలితాలు మహాభయంకరంగా పరిణమించేటట్టు కనపడుతున్నై. ఇద్దరు ముగ్గురు పెద్దలకు జైలుప్రాప్తి కలిగేటట్టు కనపడుతున్నది. కొన్ని విచిత్రములైన విషయాలు బయటపడినై. మరికొన్ని త్వరలో బయటపడనున్నై. సుబ్బారావుమనస్సింకా ఆవిషయాలమీదనే ఉంది.

సీత అతను తన్ను గమనించకపోవటం చూసి ఇంతమొహం చేసుకున్నది. అతను పరధ్యానంగా స్నానానికి వెళ్లాడు. భోజనానికి వచ్చినప్పుడు కూడా అతని మనస్సెక్కడో ఉన్నది.

అతను భోజనం చేస్తూ అకస్మాత్తుగా తలఎత్తి "ఈకూర ఎంత బాగా కుదిరిందీ!" అన్నాడు.

సీత మామూలుఅలవాటుచొప్పున నవ్వినట్టు నవ్వలేదు. ఏమాత్రమో తడిగాఉన్నట్టు కనిపించే కళ్లు అతనివైపు తిప్పి మళ్లీ నేలవంక చూస్తూ ఊరుకుంది. ఆమె కిందిపెదవి ఏమాత్రమో వణుకుతూ ఒక్కసారి ఆమె పైపలువరుసకిందికి వెళ్లివచ్చింది.

"సీతా!" అన్నాడు సుబ్బారావు ఆదుర్దాగా.

ఈసారి సీత తల ఎత్తినప్పుడు ఆమెకళ్లు స్పష్టంగా తడితో మెరుస్తున్నై.

"ఏమిటది? ఎందు కట్లా ఉన్నావు?" అన్నాడతను ఆదుర్దాగా.

"నే నెట్లా ఉన్నాను? మీకే ఎందుకో నామీద కోపం వచ్చింది. నేను ముందు భోంచేశాననో ఏమో! ఇక ఎప్పుడూ భోంచెయ్యను లెండి!" అన్నది సీత.

సుబ్బారావు పొంగిపోయినాడు. ఆక్షణంలో అతను ఆ ఎంగిలిచేత్తోనే లేచివచ్చి ఆమెను గట్టిగా కౌగిలించుకుని ఎందుకు ముద్దుపెట్టుకోలేదో అతనికే తెలియదు ఈనాటికీ. ఇది ప్రేమే! ఇది చాదస్తం కాదు. అయితే తనకంటె ముందు భోంచెయ్యను.

అతను మృదువుగా "నే నేదో ఆలోచిస్తున్నాను. నాకు నీమీద కోపం వచ్చిందని ఎందుకు నీకంత అనుమానం?" అన్నాడు. అతని మొహంకూడా సంతోషంతో వికసించింది. "నావిషయమై నీకంత ఆరాటం ఎందుకు సీతా!"

సీత జంకుతూ సమాధానం చెప్పింది.

"ఎందు కట్లా అడుగుతారు? నేను మీభార్యను కానూ?"

అతనికి మోహాన చిరునవ్వు తుడిచేసినట్టు మాయమయింది. అతను మౌనంగా తలవంచుకుని భోజనం పూర్తిచేశాడు.



"ఆ ఎంగిలిచేత్తోనే లేచివచ్చి ఆమెను గట్టిగా కౌగిలించుకుని ఎందుకు......"

అతనివెంట ఆమెకూడా వచ్చింది గదిలోకి.

"నేను అజ్ఞానురాలిని. నావల్ల తప్పులుంటే క్షమించండి. నాకు మీరు సంతోషంగా లేకపోతే చాలాకష్టంగా ఉంటుంది. నేను మీ కెట్లాగో ఉత్సాహ భంగంచేశాను. నాకు చాలాకష్టంగాఉంది—" పైన మాట్లాడలేక సీత చీరకొంగుతో కళ్లు తుడుచుకో సాగింది.

చప్పున సుబ్బారావుకు వెంకటరమణయ్య స్ఫుర ణకువచ్చాడు. తరువాత ఆయన చివరచెప్పిన మాటలు అతనిచెవిలో మోగినై. ఆయన వద్దన్న ఒక్కపనీ చేస్తు న్నాడు తను. ఆమెను హింసిస్తున్నాడు. ఆమె తన భర్తను ప్రేమించింది కనక తను ఆమెను హింసిం చాలా? ఆమె తనకు చూపుతున్న ప్రేమకూ, చేస్తున్న సేవకూ ఇదా బహుమతి?

"చూడు, సీతా. నన్ను నాలుగు రోజులపాటు గమనించకు. నే నిప్పు డొక పనిలో మునిగిఉన్నాను. నేను పరధ్యానంగా ఉన్నా, చిరాకుగాఉన్నా తప్పు నీమీద వేసుకోకు. సరేనా? నాకు నీమీద ఏకారణం చేతా కోపంరాదని నమ్ము. అంతకన్న ఇప్పుడేమీ చెప్పలేను. నువ్విట్లా అనవసరంగా చింతించటం నాకు చాలా కష్టంగావుంది," అని అతను డ్రెస్సు వేసుకుని బయటికి వెళ్లిపోయినాడు.

సుబ్బారావు చేసిన భోగట్టా అతనికి వారం రోజులు పట్టింది. ఆతరవాత ఆపనిమీదినించి అతన్ని తప్పించి చెయ్యవలసినదంతా కంపెనీవారే చేశారు. ఆవి వరాలన్నీ పత్రికలలో కాలక్రమాన ప్రకటించబడినై.

ఒక్కసారిగానే తన జీవితంలో అడుగుపెట్టిన రెండు సమస్యలలోనూ ఒకటి తృప్తికరంగా ఒక ఒడ్డు చేర్చి రెండవదానివైపు తిరిగాడు సుబ్బారావు.

నిజానికి వెయ్యిమందిలో తొమ్మిదివందల తొంభైతొమ్మిది పైచిల్లరకు ఇది సమస్యేకాదు. తను చెయ్యవలసిందంతా ఏమిటంటే మారు మాట్లాడకుండా సీతను స్వీకరించటం. అందులో తప్పేమీ లేదు. పైగా అది ఉభయులకూ చాలా తృప్తికరమైనటువంటి ఏర్పాటుకూడానూ! కాని—

అక్కడే సుబ్బారావుకు చిక్కు వచ్చింది. అట్లా చేసి సుబ్బారావు సీతతో నిజమైన సుఖం ఒక్కక్షణం అనుభవించలేదు. ఆమెకు తనమీద ప్రేమ ఉన్నదని సంపూర్ణంగా విశ్వసించటానికి తనకు ఎంతమాత్రమూ ఆధారం చిక్కలేదు— చిక్కేటట్టూ లేదు. అతనికి ఆనాటి కానాడు ఆమెమీద ప్రేమ ఎంత ధ్రువం అవుతున్నదో ఆమె తనను ప్రేమించటం నిరూపణ కావటం అంత అనుమానాస్పదం అవుతున్నది. 'నేను నీభార్యను కానా? నువు నాభర్తవు కావా?' అనేవాదన సీత మొండి తనంవల్ల చెయ్యటంలేదు. ఆమె కంతకన్న ఆధారం లేదు. పాపం. ఏంచేస్తుంది?

పిచ్చిసీత! అమాయకురాలు! ఆమెను తన ఇంట ఒక్కక్షణం ఉంచుకునే అర్హత తనకు లేదు. అతను ఒక తీర్మానానికి వచ్చాడు.

సీతకూడా ఒక తీర్మానానికి వచ్చినట్లే కనపడ్డది. ఆరాత్రి భోజనానంతరం అతను వెన్నెలషికారు వెళ్లి చాలా ఆలస్యంగా తిరిగివచ్చాడు. సీత గదిలో— వారు వేరువేరుగదుల్లో శయనిస్తున్నారు—దీపంతగ్గించి ఉన్నది. సీత అతని కాలిచప్పుడువిని లేచి కూర్చున్నది. అతను గమనించనివాడల్లే వెళ్లి తనగదిలో పడుకున్నాడు.

అయిదునిమిషాలలో ఆమె మెల్లిగా అతనగదిలోకి వచ్చింది. అతను నిద్రపోతున్నట్టు నటించాడు. ఆమె అతనిమీద చెయ్యివేసింది. అది ప్రథమస్పర్శ. అతని శరీరం జల్లుమన్నది. పక్కలో లేచి కూర్చున్నాడు.

"నామూలకంగా మీ రేదో బాధపడుతున్నారు- ఉండండి!- నేను మిమ్మల్ని దెప్పటం లేదు. నేను మిమ్మల్ని సుఖపెడదామని వచ్చాను. అది నాచేతకాలేదని తెలుసుకున్నాను. నన్ను మానాన్నదగ్గిరికి పంపించండి. ఒకప్పుడు భయపడ్డాను, నన్ను మీరు చాలా చులకనగా చూస్తారని. ఈవిధంగా నన్నుగురించి మీరు లోలోపల విచారిస్తారని నాకు తెలియదు. మీకష్టం ఏమిటో నాకు స్పష్టంగా చెప్పండి, నాశరీరం అమ్మి తీర్చుతాను. మీరు పైకి నాతో మంచిగా ఉంటూ లోపల బాధపడుతుంటే నాగుండె పగిలిపోతున్నది. నే నేదో పాడుఘడియలో ఇక్కడ అడుగుపెట్టాను" అన్నది సీత.

తను పాడుఘడియలో అడుగుపెట్టింది కా? ఆ క్షణంనుంచీ తను ఎంతసుఖం అనుభవిస్తున్నాడో ఆమె కేంతెలుసును? ప్రేమించబడటం ఎంత సుఖకరమైన విషయమో ప్రేమించటం అంత బాధాకరం. అతను ప్రేమిస్తున్నాడేకాని ప్రేమించబడుతున్నా డనే నమ్మకంలేదు. దానికే అతని ఆరాటం యావత్తూనూ. ప్రేమించి ప్రేమించబడనివాడికి తెలుస్తుంది ప్రేమించటం ఎంతకష్టంతో కూడుకున్న విషయమో.

"నువు నన్ను ప్రేమించా ననుకుంటున్నావు సీతా. అది పొరపాటు. నువు పాతివ్రత్య ధర్మప్రకారం నీభర్తను ప్రేమిస్తున్నావు. అది నాకేంతృప్తి? నీభర్తనైనా ఫలాని కారణంవల్ల ప్రేమించకుండా నీభర్తగనక ప్రేమించావు."

"మీరు చెప్పేది నా కర్థం కావటంలేదు. మీరు నాభర్త అయినప్పుడు నేను నాభర్తను ప్రేమించటం మిమ్మల్ని ప్రేమించటంకాదా?"

"నేను నీభర్తను కాననుకో!"

"ఎందుకు కారూ?" సీత కొద్దిగా పాలిపోయింది.

అతను మాట్లాడుతూ సీత మొహంవంక చూడలేకపోయినాడు.

"నేను అబద్ధం ఆడాను. నా కెన్నడూ మతిచెడ లేదు. నాకు చిన్నతనంనించీ జరిగిన విషయాలన్నీ బాగా జ్ఞాపకంఉన్నై. మనం—మనం భార్యాభర్తలం కాము!"

సీత ఈసారి పూర్తిగా పాలిపోయింది. ఆమె నిలవటానికికూడా సత్తువలేక అతనిమంచంమీద ఒక మూల కూర్చుంది

ఇద్దరూ చాలాసేపు మౌనంగా ఉన్నారు.

"ఇక నీ కిక్కడ ఒక్క క్షణం గడపటంకూడా చాలాకష్టమనుకుంటాను. ఏమిటి కర్తవ్యం?" అన్నాడు సుబ్బారావు.

ఆమె చెప్పిన సమాధానం రహస్యం మాదిరిగా ఉంది.

"నా కేమీ తెలియదు. మా నాన్నగారింటికి పోవాలి. ఇంకేముందీ?...ఎంత జాగ్రత్తగా విచారించాడు మా నాన్న! పొరపాటు ఎట్లా జరిగిఉంటుంది?"

"ఎట్లా జరిగినా జరిగిఉంటుంది. ఆంధ్రదేశం నిండా నేతి సుబ్బారావులే. ఈఊళ్లో నే మరొక నేతి సుబ్బారావున్నాడు. ఈచుట్టుపక్కల గ్రామాల్లో కనీసం నలుగురు నేతి సుబ్బారావు లున్నారు—నే నెరిగినంతవరకు."

మళ్లీ కాసేపు ఇద్దరూ మాట్లాడలేదు.

"మీ రెంత మంచివారు! మరొకరయితే నన్ను మొదటిరోజునే వంచించిఉండురు. మీ రెప్పుడు నన్ను దగ్గిర కూర్చోపెట్టుకుంటారు, ఎప్పుడు ముద్దుపెట్టుకుంటారు అనిఉండేది నాకు. మీరు దూరందూరంగా ఉన్నారని నాకు చాలా కష్టంగాఉండేది. కాని నేను ఏమీ అడగలేదు. ఒకసారివితంతువును, నా కట్లా అడగటానికి అర్హతఏముందీ?"

సుబ్బారావు కళ్లవెంట నీళ్లు తిరిగినై.

"నేను మంచివాణ్ణయితే నిన్ను ఒక్క క్షణం ఈఇంట్లో ఉండనిచ్చేవాణ్ణా! నాగదిలో నువు అడుగు పెట్టగానే గది కెంత శోభవచ్చింద, నే నిన్ను తిరిగి పంపివెయ్యటం నాకు అసంభవం అయింది. నేను వట్టి స్వార్థపరుణ్ణి. నేను మామూలు పెద్దమనిషినైనా కాను!"

అతను గడియారంచూసి "ఇంకా మెయిలుకు అరగంట వ్యవధిఉంది. బయలుదేరుతావా?" అన్నాడు.

"బయలుదేరుతాను."

"నువ్వు వెళ్లినతరువాత ఈఇల్లు స్మశానంమాదిరిగా ఉంటుంది—కొంతకాలం పాటు." అన్నాడతను చుట్టూ చూస్తూ.

ఆమెకూడా చుట్టూ కలయచూసి "ఈఇంట్లో ఉన్న ప్రతి వస్తువునూ ప్రేమించటం నేర్చుకున్నాను. నాకూ కొంతకాలం పాటు ఇదంతా మరుపురాదు."అన్నది.

"ఇకలే! నీబట్టలూ అవీ సర్దుకో! చీరకూడా మార్చుకో."

సీత సరేనన్నట్టు తల ఊపిందికాని కదలలేదు.

"మళ్లా నీభర్తకోసం అన్వేషణ ప్రారంభిస్తావా? నేనుకూడా నాచాతనైనసహాయం చేస్తాను."

"నేనిక ఏమీచెయ్యను. అదంతా వట్టిచాదస్తం అనిపిస్తున్నది. ఈజీవం ఇట్లాగే వెళ్లిపోతుంది."

"ఛే, సీతా! ఎక్కువవ్యవధి లేదు... నేను నిన్ను తరుముతున్నానా?"

ఆమె మారుమాట్లాడకుండా లేచి కాళ్లీడ్చుకుంటూ తనగదిలోకి వెళ్లింది.

"అయిదు నిమిషాలలో తయారుకా ప్రయాణానికి!"

తనుకూడాలేచి సీతగదికి వెళ్లేలోపల సుబ్బారావు అయిదునిమిషాలు కాదు పదినిమిషా లాగాడు.

అతను వెళ్లేటప్పటికి సీత గది చిందరవందరగా ఉన్నది. ఆమె గదిమధ్య పెట్టెపెట్టుకుని పరధ్యానంగా చూస్తున్నది. ఆమెసర్దుడు ఇంకా ప్రారంభమైనాకాలేదు.

అతన్నిచూడగానే ఆమె లేచి విపరీతంగా ఏడుస్తూ, "నేను పోలేనండీ! నేనిక్కడే వుంటాను. నన్నిక్కడే ఉండనివ్వండి!" అన్నది.

సుబ్బారావు నిర్ఘాంత పోయినాడు.

"ఏం జరిగింది? ఎందు కట్లా బాధపడతావు?" అన్నాడు సుబ్బారావు.

ఆమె నేలమీద కుప్పగాకూలి చెప్పతరంకాకుండా ఏడవటం మొదలుపెట్టింది.

"నేను మా నాన్నగారింటికి పోలేను. నా ప్రాణం ఇక్కడే ఉంటుంది. నాకు నా మొగుడవసరం లేదు. నేను పోతే మిమ్మల్ని ఎవరుచూస్తారు? నేను మిమ్మల్ని విడిచిపెట్టిపోలేను. నన్ను పనిమనిషి కింద నైనా ఇక్కడ ఉండనివ్వండి!"

అతను కలలో కూడా ఆశించనిమాట సీతనోటి వెంట వచ్చింది. అతని కింకేంకావాలి?

అతనుకూడా ఆమెపక్కన చతికిలపడి ఆమెను తన దగ్గిరికి లాక్కుని ఆమెదుఃఖమంతా పొయ్యేటట్టు ముద్దు పెట్టుకున్నాడు.

చివరకు ఆమె అతనివైపు మొహంతిప్పినప్పుడు ఆతడి మొహంమీద చిరునవ్వువాన కురిసి వెలిసిన మీదట లేతఆకుగుబురుమీద పడిన సూర్యప్రకాశం మాదిరిగా ఉంది.

"నిన్ను ఎంతలో పోగొట్టుకునేవాణ్ణయినాను. సీతా!" అన్నాడతను నవ్వుతూ.

"నాకేమతిలేదు. మీ రెన్నిసార్లడిగినా నా నోటివెంట నాకు మీమీద ఎంతప్రేమ ఉన్నదీ తెలియచేయలేకపోతిని. మీరుపడ్డట్టే నేనూ బాధపడ్డాను. మీకు నామీద ప్రేమలేదేమోనని...మనమిద్దరమూ ఇప్పుడు ప్రపంచానికి వెలికావాలి. నేను అదివరకే వెలి. పాపం మీరు—"

"నేను నీమొగుణ్ణి కనక వెలి. నేనేనీ మొగుణ్ణి. నా అవస్థ కనుక్కోలేదా నువ్వు? నిన్ను చూసిన క్షణం నించీ నీకూనాకూమధ్య ఏదీ అడ్డంరారాదని తీర్మానించుకున్నాను. కాని నాచేతులతో కట్టిన మంగళసూత్రమే అడ్డంరావటం మొదలు పెట్టింది. అందుకని ఆ అబద్ధం ఆడాను. నేనునీమొగుణ్ణి కానన్నాను. అనలేదనుకో. ఇద్దరమూ సుఖంగాకాపరంచేసేవాళ్లం. కాని ఆమంగళసూత్రం మనిద్దరి మధ్యా అట్లాగే ఉండేది. తరవాత నువ్వు నన్ను ఏవిధంగానూ నమ్మించలేవు. అది ఎప్పటికీ తేలదు—ఆనిజం. అందుకని నిన్ను పోగొట్టుకోటానికైనా సంసిద్ధుణ్ణి అయినాను."

"అమ్మదొంగా!" అన్నది సీత.

అంతే! సామాన్యవ్యక్తులకే చాతనవును ఇంత అసామాన్యంగా ప్రవర్తించటం.

" అమ్మదొంగా!" అన్నది సీత."